క్లుప్తంగా

పాదయాత్రికులకు వైద్యసేవలు



భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కాలినడకన శ్రీశైలం వెళ్లే కర్ణాటక భక్తుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పలు చోట్ల ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కర్నూలు నగరంలోని వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం వద్ద, నందవరం మండలం సోమలగూడూరు, నల్లమల అడవి ప్రాంతంలో పెద్ద చెరువు వద్ద, శ్రీశైలం పరిసరాల్లో, కైలాస ద్వారం, నందిమండపం వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు కాళ్లకు బొబ్బల గాయాలు, నొప్పులతో బాధపడుతున్న వారికి ప్రథమ చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. 20 ఏళ్లుగా ఇలాంటి శిబిరాలు కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఉచిత వైద్యశిబిరం ఐదు రోజుల పాటు కొనసాగిస్తామన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన పారిశుద్ధ్య కార్మికులు కె.లక్ష్మి, జి.కల్యాణ్‌కుమార్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, విజయ్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించిన ఏ1 ఏజెన్సీని వెంటనే తొలగించాలన్నారు. ఆ ఏజెన్సీ అక్రమాలపై విచారణ జరపాలన్నారు. నాయకులు కె.రామకృష్ణ, కృష్ణ, మహ్మద్, సోలమన్‌రాజు, డి.కుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో షార్ట్‌సర్క్యూట్‌తో సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గురువారం ఉదయం షార్ట్ సర్క్యూట్ జరిగి పలు విభాగాల్లో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉదయం 10 గంటల సమయంలో ఏఎంసీ వెనుక వైపు ఉన్న విద్యుత్ తీగల్లో లోడు అధికమై షార్ట్ సర్క్యూట్ ఏర్పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఏఎంసీ, క్యాజువాలిటీ, ఓపీ విభాగాలు, రేడియాలజీ విభాగంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కొద్దిసేపటికి జనరేటర్ ద్వారా క్యాజువాలిటీ, ఏఎంసీ విభాగాలకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించారు. అనంతరం ఏఎంసీ వద్ద పనులు నిర్వహించి గంట తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ కారణంగా కొంతసేపు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, మెడికల్ రికార్డు రూమ్‌లో సేవలు నిలిచిపోయాయి.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక



షేక్ అబ్దుల్లా

కర్నూలు (టౌన్): ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు చండీఘడ్‌లోని మెహాల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 61 కిలోల విభాగంలో కర్నూలు రాయలసీమ యూనివర్సిటీకి చెందిన షేక్ అబ్దుల్లా ప్రతిభ చాటాడు. ఈ పోటీల్లో 5వ స్థానంలో నిలిచి ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. తమ యూనివర్సిటీకి చెందిన క్రీడాకారుడు ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక కావడంపై ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనందరావు, రెకార్ట్ ప్రొఫెసర్ క్రిష్టారెడ్డి, వర్సిటీ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ యూసుఫ్ హర్షం వ్యక్తం చేశారు. ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక కావడం ఇదే తొలిసారి అని వారు పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కబ్జా,బలగం, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కబ్జా, సార్, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, గనా
వెంకటేష్‌సినీ కాంప్లెక్స్: సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : తూ జూతీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
భరత్ కాంప్లెక్స్: పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వినరో భాగ్యము విష్ణు కథ
రాజ్ : కబ్జా
శ్రీరామ : షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
విజయ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ



● ఈ చిత్రంలో ఆహార పదార్థాలు వడ్డిస్తున్న వారు పంచాయతీ రాజ్ ఇంజినీర్ల అన్నదాన కమిటీ సభ్యులు. పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ కె.విజయభాస్కర్ ఆధ్వర్యంలో గార్గేయపురం గ్రామంసమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ వద్ద శ్రీశైలం పాద యాత్ర చేస్తున్న కర్ణాటక భక్తులకు ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. ఇంజినీర్లు సునీల్, నాగభూషణం, మద్దులేటి, రమణలతో పాటు పీఆర్ ఎస్ఈ, నంద్యాల, కర్నూలు, ఆదోని ఈఈల సహకారంతో గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విజయభాస్కర్ పేర్కొన్నారు.



● ఈ చిత్రంలో అల్పాహారం, ఫలహారాలు అందజేస్తున్న వారు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సేవా సమితి సభ్యులు. 2010 నుంచి వీరు మండ్లెం గ్రామ సమీపంలో టెంట్ వేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా సమితి అధ్యక్షురాలు పసుపులేటి నీలిమ ఆధ్వర్యంలో సభ్యులు రత్నమ్మ, జనార్ధన్, శ్రీకర్, మాలతి, కమలమ్మ, వరలక్ష్మి, శోభన్‌బాబు, జ్యోతిర్మయి, శ్రీనివాస్, మండ్లెం సామన్నలు శివభక్తులకు వివిధ రకాల పండ్లు, పెరుగన్నం, చెరుకు గడలు, క్యారెట్, డాక్టర్ వి.బ్రహ్మరెడ్డి హాస్పిటల్ వారు మందులు అందజేస్తున్నారు. బంధువులు, స్నేహితులు, మండ్లెం గ్రామస్తుల సహకారంతో గత 12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నీలిమ వెల్లడించారు.

భక్తి మార్గంలో సేవా పరిమళాలు

- శ్రీశైల పాదయాత్ర భక్తులకు సేవా సంస్థల సపర్యలు
- ఆహార పదార్థాలు, ఫలహారాలు అందిస్తున్న వలంటీర్లు
- వైద్య శిబిరాల నిర్వహణ
- ఔదార్యాన్ని చాటుతున్న స్వచ్ఛంద సేవా సంస్థలు



● ఈ చిత్రంలో ఆహార పదార్థాలు అందజేస్తున్న వారు వివేకానంద స్టడీ సర్కిల్ వలంటీర్లు. జి.పుల్లారెడ్డి కళాశాలకు సంబంధించిన ఈ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ నాగఫణి శాస్త్రి మార్గదర్శకత్వంలో 2009 నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అల్పాహారం, తేనీరు, మజ్జిగ, అందజేస్తున్నారు. ప్రాథమిక చికిత్స చేయించడంతో పాటు కాళ్ల నొప్పులు పోయేందుకు ఆయిల్ మసాజ్ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం బొల్లవరం, నల్లమల అటవీ ప్రాంతం సమీపంలోని వీరభద్ర స్వామి ఆలయం వద్ద కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు సపర్యలు చేస్తున్నారు. మధుసూదన్‌రావు, దేవకిలతో పాటు కళాశాల అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు సాయి చరణ్, భార్గవ, శ్రీ చక్ర, ప్రణీత్, శరత్, స్వరూప్, ప్రేమ్‌సాయిల సహాయ సహకారాలతో సేవ చేస్తున్నట్లు నాగఫణిశాస్త్రి పేర్కొన్నారు.

కర్నూలు కల్చరల్: శ్రీశైలం ఆధ్యాత్మిక దారిలో సేవా పరిమళాలు వెదజల్లుతున్నాయి. కన్నడిగుల భక్తికి తెలుగు వారి సేవా తత్పరత తోడయ్యింది. శ్రీశైల భ్రమరాంబా దేవి పుట్టింటి వారైన కర్ణాటక వాసులు ఉగాది పర్వదినాన తమ ఆడపడుచుకు ఒడి బియ్యం తీసుకెళ్లడం ఆనవాయితీ. ఇందుకోసం కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ తమ భక్తిని చాటుతూ శ్రీశైలం చేరుకుంటారు. వారికి నడక మార్గంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు స్వచ్ఛంద సంస్థలు సేవలందిస్తూ సపర్యలు చేస్తున్నాయి. దారి పొడవునా తాగునీరు మొదలుకొని మజ్జిగ, ఆహారం, పండ్లు అందజేస్తున్నారు. కాళ్లకు గాయాలైతే ప్రథమ చికిత్స చేయించి మందులు అందజేస్తున్నారు. కాళ్లకు నొప్పులు పోయేందుకు మర్దన చేస్తూ వారి భక్తిలో వీరు సేవ ద్వారా పాలు పంచుకుంటున్నారు.

21న వాహనాల వేలం

కర్నూలు: మద్యం, నాటుసారా రవాణా చేస్తూ తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 21వ తేదీన కర్నూలు సెబ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సీఐ సత్యనారాయణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ద్విచక్ర వాహనాల కోసం రూ.5 వేలు, ఆటో, కారు, లారీ, క్యారేజ్ ఆటోలకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కర్నూలు సెబ్ స్టేషన్‌కు వచ్చి దరావత్తు చెల్లించి టోకెన్ తీసుకుని వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వాహనాలు దక్కని వారికి డిపాజిట్ సొమ్ము వాపసు ఇస్తామని తెలిపారు. వాహనాలు దక్కించుకున్నవారు వేలం పాడిన సొమ్మును 18 శాతం జీఎస్టీతో కలిపి వెంటనే చెల్లించి వాహనాలను స్వాధీనం చేసుకోవచ్చన్నారు.

22న ఉగాది ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, దేవదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయంలో ఉగాది ఉత్సవాలు, ప్రంచాంగ శ్రవణం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయం ఈఓ దినేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించిన సాహిత్య పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ.. 23 నుంచి 29వ తేదీ వరకు శ్రీమద్రామాయణ సప్తహా ప్రవచనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, కళా స్రవంతి భాస్కర్, సైనిక సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అవకాశాలు అందిపుచ్చుకోవాలి



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

కర్నూలు (టౌన్): ప్రభుత్వం మహిళలకు ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని, క్రీడారంగంలోనూ ప్రోత్సాహం అందిస్తోందని స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలులో ఈనెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాటి నుంచి మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మహిళలకు టెన్నికాయిట్, లెమన్ – స్పూన్, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్రీడా పోటీలు, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి పోటీలు

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఈఓ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 400 మీటర్ల పరుగు పందెం, స్పీడ్ వాక్, శాక్‌వాక్, తొక్కుడు బిళ్ల, టగ్ ఆఫ్ వార్, కుర్చీల ఆట పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు, యువతులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

24న వంటల పోటీలు

ఈనెల 21వ తేదీన ఉగాది పండుగ పురస్కరించుకుని 24వ తేదీ వంటల పోటీలు నిర్వహించనున్నట్లు సీఈఓ తెలిపారు.

బాలికలపై వివక్ష తగదు



హాజరైన అధికారులు, సిబ్బంది



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రుక్యాబేగం

కర్నూలు(రాజ్‌విహార్): ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ ఎస్ కె.రుక్యా బేగం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సీ.క్యాంప్ వద్ద టీజీవీ కళాక్షేత్రంలో 'నీటి వినియోగంలో మహిళల పాత్ర' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఆడ పిల్లల్ని భారంగా కాకుండా అబ్బాయిలతో సమానంగా పెంచాలని సూచించారు. బాలికల చదువుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకొచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, అప్పుడే విద్య, ఆర్థిక, కుటుంబ, సమాజ రంగాల్లో రాణించే వీలుంటుందని చెప్పారు. ఉదయం లేచిన మొదలు రాత్రి పడుకునే వరకు నీటితో అత్యవసరం ఉంటుందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ.. కొళాయి ద్వారా నీటిని ఇంటింటికీ సరఫరా చేస్తోందని, వీటిని వృథా చేస్తే భవిష్యత్తులో సమస్యలు తప్పవన్నారు. బాలికల్లో పౌష్టికాహార లోపాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిని ఎలా పొదుపుగా వాడుకోవాలలో వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యామలాదేవి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని అధికారికంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్ర పటానికి డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, బీసీ సంక్షేమ శాఖ ఈడీ ఏ.నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారని, ఆయన ప్రాణ త్యాగ ఫలితంగా 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కర్నూలు(రాజ్‌విహార్): స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, లక్ష్మీ కాంతయ్య, జగన్నాథ్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): నగరపాలక కౌన్సిల్ హాలులో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర పాలక డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ.రమాదేవి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ పార్కులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆవోపా అధ్యక్షుడు గోనూరు యుగంధర్‌శెట్టి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ పుల్లారెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

సుధాకరబాబుకు సన్మానం

కర్నూలు(సెంట్రల్): ఏఐసీసీ సభ్యుడిగా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబును ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం ఉదయం 11 గంటలకు ఆ పార్టీ కార్యాలయంలో ముందుగా పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎం.సుధాకరబాబును పూలమాలలు వేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాలకొండయ్య, పీఎస్ జాన్, ఖాజాఖాన్, దేవిశెట్టి ప్రకాష్, సత్యనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్రబాబు, ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని గోకారి భవన్‌లో వర్ధంతి సభలకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు.

6న హనుమాన్ శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: హనుమజ్జయంతి పురస్కరించుకొని భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార పత్రాలను గురువారం జి.పుల్లారెడ్డి భవన్‌లోని వీహెచ్‌పీ కార్యాలయంలో వివిధ సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఓల్డ్ సిటీలోని జమ్మిచెట్టు నుంచి పాతనగరం లలితా పీఠం, వడ్డె గేరి, రాజ్‌విహార్ మీదుగా బుధవారపేటలోని ఓం సాయి సీతారామాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర జరుగుతుందన్నారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ కార్యాలయం జి.పుల్లారెడ్డి భవన్‌లో గురువారం ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభించారు. జి.పుల్లారెడ్డి సేవా ట్రస్టీ జి.ఏకాంబరరెడ్డి దాతృత్వంతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ.. కంప్యూటర్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర సామాజిక సమరసత కన్వీనర్ క్రిష్ణన్న, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పీజీ నీట్‌లో ప్రతిభ



షేక్ రసూల్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన షేక్ ఖాజా రసూల్ పీజీ నీట్‌లో 1004 ర్యాంకు సాధించాడు. కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఈయన హైదరాబాద్‌లో నీట్‌కు శిక్షణ తీసుకున్నారు. ఆయన తండ్రి షేక్ కుతుబుద్దీన్ వైద్య ఆరోగ్యశాఖలోని పీవోడీటీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తనకు పీడియాట్రిక్స్ లేదా డెర్మటాలజీలో సీటు వచ్చే అవకాశం ఉందని రసూల్ తెలిపాడు.

20న వ్యాసరచన పోటీలు

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు ప్రమాదాల నివారణపై ఈ నెల 20వ తేదీన వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో సాయంత్రం 4 గంటల నుంచి 'నీవే హీరోగా రోడ్డు ప్రమాదాలు ఎలా నివారిస్తావు' అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 10 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం ఉండాలి



స్టాఫ్ నర్సులకు కిట్లు అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఒక బిడ్డ ప్రసవం అనంతరం మరో బిడ్డ జన్మించేందుకు కనీసం మూడేళ్లు ఎడం ఉండాలని అప్పుడే తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మాతాశిశు కేంద్రంలో తాత్కాలిక కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాలా మంది స్త్రీలు బిడ్డకు పాలిస్తున్నంత కాలం గర్భం ధరించలేమని దృఢ విశ్వాసంతో ఉంటారని, అలాంటి వారికి నెలసరి రాకముందే అండోత్పత్తి జరిగే అవకాశాలున్నాయన్నారు. ప్రసవానంతరం గర్భ నిరోధక సాధనాలు ఉపయోగించకుండా లైంగిక చర్యలో పాల్గొన్నట్లయితే వద్దనుకున్నా గర్భం ధరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పూర్వపు బిడ్డ 24 నెలలు నిండక ముందే గర్భం ధరించినట్లయితే పుట్టబోయే బిడ్డ గర్భస్థ పిండ మరణం, తక్కువ బరువుతో జన్మించడం, నెలలు నిండక ముందే జన్మించడం వంటి అవకాశాలు ఉంటాయన్నారు. స్త్రీలు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స అవసరం లేదనుకున్నప్పుడు సమర్థవంతంగా ఎక్కువ కాలం పనిచేసే పీపీఐయూసీడీ పద్ధతిని అనుసరించాలన్నారు. గణాంకాధికారి హేమసుందరం, శివకుమార్, ఖలీల్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



అమడగుంట్ల హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కోడుమూరు రూరల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసవ్వాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌ను పీడీ అమర్‌నాథ్ రెడ్డి సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షల పట్ల భయాన్ని వీడి ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో చదువుకోవాలన్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు పది విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అంతకుముందు డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అమడగుంట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలు, ఉపాధి సిబ్బందికి అనేక సూచనలిచ్చారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రతి కూలీకి రోజుకు రూ.250 వేతనం పడుతుందని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పీడీ సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ జయంతి వెంట ఉన్నారు.

లోపించిన పారిశుద్ధ్యం



వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద నిలిచిన మురుగునీరు

కర్నూలు (న్యూటౌన్): వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానం వద్ద డ్రైనేజీ కాల్వ లేక మురుగు నీరు నిలిచి పందుల స్వైరవిహారంతో కంపుకొడుతోంది. ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ముక్కు మూసుకుని దర్శించుకునే దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. గతేడాది మే 21వ తేదీన రూ.7 లక్షలకు డ్రైనేజీ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. ఏడాది గడుస్తున్నా డ్రైనేజీ నిర్మాణం నేటి వరకూ చేపట్టకపోవడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణానికి సంబంధించి కర్నూలుకు చెందిన ముక్తా కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ నవీన్ ఒప్పందం చేసుకున్నారు. అయితే డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కేవలం పరిశీలనతోనే కాలయాపన చేస్తున్నారని, ఇంతవరకూ నిర్మాణ పనులు ప్రారంభించలేదని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి వెల్లడించారు. ఇప్పటికైనా దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

పేద విద్యార్థుల చదువుకు సాయం

కర్నూలు కల్చరల్: పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు కర్నూలు రెడ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులకుర్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం నన్నూరు సమీపంలోని రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో సంఘం ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న ఆశ్రయ రెడ్ల వృద్ధాశ్రమానికి దాతలు జి.పుల్లారెడ్డి ట్రస్ట్ చైర్మన్ రాఘవరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పాలగిరి సుబ్బారెడ్డి, ట్రస్టీ జి.ఏకాంబర రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గత 23 ఏళ్లుగా నిరుపేద రెడ్లకు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు వృద్ధాశ్రమం నిర్మించి అభాగ్యులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అనంతరం సంఘం ప్రతినిధులు దాతలను సన్మానించారు.